క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ రుసుం శతశాతం వసూలు చేయాలి

• కమిషనర్ నల్లనయ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ట్రేడ్ లైసెన్స్‌ల రుసుం శత శాతం వసూలు చేయడమే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు చేయాలన్నారు. ఇంతవరకు తక్కువగా వసూలు చేసిన వారిని మందలించారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



పతివాడ పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రఘువర్మ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పలు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంపడాం, పసపాం, పతివాడ, గోవిందపురం, కోనాడ, తిప్పలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి, తనకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో గొర్లె త్రినాథ్, గొంప శ్రీనివాసరావు, ఆళ్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నాకాబందీ..



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి పట్టణంలో నాకాబందీ నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి వేకువజాము రెండు వరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు సురేంద్రనాయుడు, రామ్‌గణేష్ , లక్ష్మీప్రసన్నకుమార్, రమణ, తదితరులు గంటస్తంభం వద్ద తనిఖీ నిర్వహించారు. వన్‌టౌన్ సిబ్బందితో పాటు ఎస్టీఎఫ్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్నవారిని, ర్యాష్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు.

‘నెట్’ అర్హతతో అవకాశాలు



ప్రొఫెసర్ వెంకటేశ్వర్లులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: నేషనల్ ఎడ్యుకేషన్ టాలెంట్ (నెట్)టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి బోధన, ఇతర రంగాలలో ఉన్నత అవకాశాలు లభిస్తాయని ఎంబీటీఎస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటేశ్వరులు అన్నారు. సోమవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ‘ఎన్‌టీఏ నెట్ అండ్ కెరీర్ అవకాశాలు’ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్లు, విశ్వవిద్యాలయాలలో ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆయన్ను ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ డాక్టర్ వరూధిని, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా..!



సోమవారం ఉదయం 11:56 గంటలకు తాళం వేసి ఉన్న వల్లూరు సచివాలయ సిబ్బంది గది

• ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వల్లూరు వీఆర్ఓ, సర్వేయర్
• సిబ్బంది రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటున్న ప్రజలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వీఆర్వో, సర్వేయర్ విధులకు హాజరు కావడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గడిచిన వారం రోజుల నుంచి సచివాలయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన అవసరం లేకుండా, అన్ని పనులూ సొంత ఊరిలోనే పూర్తయ్యేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రజలు కూడా సచివాలయాలను ఆశ్రయించి పనులను సకాలంలో పూర్తి చేసుకునేవారు. అయితే కొద్ది రోజులుగా వల్లూరు సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వీఆర్వో అస్సలు అందుబాటులో ఉండడం లేదని.. ఫోన్ చేసినా స్పందించడం లేదని గ్రామానికి చెందిన పంచాది శ్రీను, సువ్వాడ రమేష్‌నాయుడు సోమవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సచివాలయానికి వస్తే డోర్ లాక్ వేసి ఉంటుందన్నారు. ఇదే విషయమై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమస్యపై ఎంపీడీఓ రామకృష్ణరాజు స్పందిస్తూ సచివాలయాలను నిత్యం తనిఖీ చేస్తున్నామన్నారు. తనిఖీ సమయంలో వీఆర్వోలు లేకపోవడాన్ని గుర్తించి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. వల్లూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తామని సిబ్బంది గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా తహసీల్దార్ సుదర్శనరావు వివరణకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

తోటపల్లి కాలువ పనులు నిలిపివేయాలి



తోటపల్లి కాలువ పనులు అడ్డుకుంటున్న కందివలస రైతులు

పూసపాటిరేగ: మండలంలోని కందివలసలో ఊరచెరువు గర్భంలో జరుగుతున్న తోటపల్లి కాలువ పనులను తక్షణమే నిలిపివేయాలని గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. చెరువులో జరుగుతున్న కాలువ పనులను సర్పంచ్ దేశెట్టి గణేష్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సమయంలో అక్కడే వున్న తోటపల్లి ఇంజినీరింగ్ అధికారులు కె. సుబ్బారావు, కె. దేవిలతో వాగ్వాదానికి దిగారు. కందివలస గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 119లో 54 ఎకరాలున్న చెరువులో సుమారు 10 ఎకరాలు తోటపల్లి కాలువ పనులకు పోవడంతో సాగుకు నీరు అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఊరచెరువులో సగానికిపైగా చెరువు గర్భం తోటపల్లి కాలువతో పాటు గోడ నిర్మాణానికి పోవడంతో నీటి నిల్వకు అవకాశం ఉండదని.. దీంతో సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు నీరు అందదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఇంజినీరింగ అధికారులు పునరాలోచన చేసి ఊరచెరువులో కాలువ పనులు తప్పించే విధంగా డిజైన్ మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చాపల సత్తిబాబు, మాజీ సర్పంచ్ ముత్యాలు వెంకటరమణ, ఊరచెరువు ఆయకట్టు సంఘ అధ్యక్షుడు పులపా వెంకటప్పారావు, రైతులు పులపా సంతోష్, రౌతు రామకృష్ణ, పిడుగు సీతారాం, చాపల ధర్మారావు, రౌతు వెంకటేష్‌తో పాటు పలువురు రైతులున్నారు.

శుచికరమైన ఆహారం అందించడమే ధ్యేయం

• నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



అన్న క్యాంటీన్ పరిసరాలను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: అన్న క్యాంటీన్ల ద్వారా పరిశుభ్రమైన వాతావరణంలో శుచికరమైన ఆహారాన్ని పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ చుట్టూ కలియతిరిగి పరిశుభ్రతను గమనించారు. ఆహారం ఎలా ఉన్నదీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు ముందుకు రావాలని కోరారు. అల్పాహార నిమిత్తం 350 మందికి ఒక్కొక్కరికీ 17 రూపాయల చొప్పున 5,950 రూపాయలు.. మధ్యాహ్న భోజనం నిమిత్తం 350 మందికి ఒక్కొక్కరికీ 29 రూపాయలు చొప్పున 10,150 రూపాయలు ఏకమొత్తంలో చెల్లించవచ్చని తెలిపారు. అలాగే విరాళాలను డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా గాని నెఫ్ట్ ద్వారా గాని ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా గాని అందజేయవచ్చు అని తెలిపారు.

20న సర్వసభ్య సమావేశం

డెంకాడ: ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నటు ఎంపీడీఓ భవానీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి గౌరవ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. అన్ని విభాగాల అధికారులు సమావేశానికి పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రజలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కె.అప్పలరాజు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన బకాయిదారులను కలిసి ఆస్తి, కుళాయి, ట్రేడ్, ఖాళీస్థలం, తదితర పన్నులు చెల్లించాలని కోరారు. మార్చి 31లేగా చెల్లించి, నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తే చర్యలు

• నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



దుకాణం ముందు చెత్త వేసిన వ్యాపారులను మందలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: పరిసరాలు, రహదారుల పరిశుభ్రతకు విఘాతం కలిగించే ఎట్టి చర్యలనూ సహించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. రింగ్‌రోడ్, కేఎల్ పురం, కణపాక, తదితర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని, పారిశుధ్య పనితీరుపై ఆరా తీశారు. ప్రధాన రహదారులపై దుకాణదారులు చెత్త వేయడాన్ని గమనించి మందలించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలని సూచించారు.

కూరగాయలను కొనుగోలు చేస్తాం

• మార్కెటింగ్‌శాఖ ఎ.డి రవికిరణ్

విజయనగరం ఫోర్ట్: రైతులు తాము పండించే కూరగాయలను రైతుబజార్లకు తీసుకువస్తే ఆ రోజు రేటుకు కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు బి. రవికిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటకు మద్దతు ధర రావడం లేదని భావించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 91821 58074 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నిర్ణీతకాలంలో పనులు పూర్తి చేయాలి

• నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఆయన ఆదేశాల మేరకు గాజులరేగలో 1000 కేవీ, అయ్యన్నపేటలో 500 కేవీ వాటర్ ట్యాంకులను సోమవారం సిబ్బంది శుభ్రం చేశారు. అలాగే 17వ డివిజన్‌లో పాత బస్టాండ్ వద్ద మీ సేవ కార్యాలయం తలుపులు, గ్రిల్, గ్లాసలకు మరమ్మతులు చేపట్టారు. 33వ డివిజన్ బాలాజీనగర్ ప్రాంతంలో గుంతలు పూడ్చారు. అలాగే 8, 45వ డివిజన్‌లలో పలు మరమ్మతులు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: ఒంటితాటి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి. త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపాలెం, శ్రీరాంనగర్, నాగోజీపేట, ఇందిరానగర్, రైల్వేస్టేషన్ రోడ్, బాలాజీ నగర్, సిద్ధార్థ నగర్, నరసింహ నగర్, దాసన్నపేట, ఫోర్ట్ ఏరియా, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుచుకోవాలి

• భోగాపురం సీఐ రామకృష్ణ



మాట్లాడుతున్న భోగాపురం సీఐ రామకృష్ణ, తదితరులు

డెంకాడ: ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుచుకుని ఉన్నత సమాజ స్థాపనకు కృషి చేయాలని భోగాపురం సీఐ జి.రామకృష్ణ అన్నారు. మండలంలోని పెదతాడివాడలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బాధ్యతగా నడుచుకుంటే చాలా వరకు సమస్యలుండవన్నారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో అనధికార మద్యం షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని శతజయంతి ఉత్సవానికి సర్వం సిద్ధం



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమాజం ప్రతినిధులు గవర సత్తిబాబు, తదితరులు

విజయనగరం టౌన్: అక్కినేని సాంస్కృతిక సమాజం రజతోత్సవం, అక్కినేని శత జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు సమాజం వ్యవస్థాపకుడు గవర సత్తిబాబు తెలిపారు. సోమవారం స్థానిక హుకుంపేట బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో అక్కినేని శతజయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లు, ఆహ్వానపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహానటుడు అక్కినేని శతజయంతి ఉత్సవాలను గురజాడ కళాభారతి వేదికగా మార్చి 2, 3, 4 తేదీల్లో మూడురోజుల పాటూ నిర్వహించనున్నామన్నారు. అభిమానులు, కళాకారులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ధవళ సర్వేశ్వరరావు, కుసుమంచి సుబ్బారావు, దాసరి తిరుపతినాయుడు, గెద్ద వరప్రసాద్, చొక్కాపు సత్యనారాయణ, జీవీడీ ప్రసాద్, షేక్ బాషా, కెల్ల పైడిరాజు, సీహెచ్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

• ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ విద్యుత్ మీటర్ల రీడర్ల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్ శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డీఎస్ఆర్ అమర్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ పరిధిలో సుమారు 4 వేల మంది రీడర్లు సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే రీడర్లు రోడ్డున పడతారన్నారు. ఒక్కో సర్వీస్‌కు కేవలం 3.60 రూపాయల చొప్పున పీస్ రేట్‌తో నెలకు కనీసం పది వేల రూపాయలు కూడా సంపాదించలేని చిరు ఉద్యోగులపై కక్ష సాధింపు తగదన్నారు. రీడర్ల భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు ఈ నెల 19, 20 తేదిల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, పసుమర్తి శ్రీకాంత్, దివాకర్, రమణ, శ్రీను, రాము, సతీష్‌కుమార్, యాసిన్, జగదీష్, భూషణరావు, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వృత్తి నైపుణ్య శిక్షణ

రాజాం: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆరు రోజుల పాటు ఈ తరగతులు ఉంటాయని, జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాం సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు. బాడంగి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి తెలిపారు.

నా గోడు ఎలా చెప్పేది..?



తన సమస్య చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఓ అభాగ్యుడు కార్యాలయంలోకి వెళ్లేందుకు నరకయాతన పడ్డాడు. గరివిడి మండల కేంద్రానికి చెందిన సారంపాటి అప్పారావుకు వెన్నుపూస విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. తనకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు వినతిపత్రం ఇవ్వడానికి సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నాడు. అయితే ట్రై సైకిల్‌తో మెయిన్ గేట్ గ్రిల్స్ దాటడానికి చాలా కష్టపడ్డాడు. కుటుంబ సభ్యులు ఎంతో శ్రమకోర్చి మరీ గ్రిల్స్ దాటించాల్సి వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం